# శ్రీకాకుళ గిరిజన రైతాంగ పోరాట తొలి అమరులు కా॥ కోరన్న, మంగన్నల వర్ధంతిసభ



సభలో ప్రసంగిస్తున్న కా॥యస్.ఝాన్సి

**శ్రీకాకుళం, 31-10-2020 :**

1967 అక్టోబర్ 31న భూస్వాముల గూండాల కాల్పుల్లో నేలకొరిగిన శ్రీకాకుళ గిరిజనోద్యమ తొలి అమరులు కా॥ కోరన్న, మంగన్నల 53వ వర్ధంతిసభ ఆముదాలవలస బైపాస్ రోడ్‌లోనున్న అమరుల స్థూపం వద్ద రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) ఆధ్వర్యంలో జరిగింది. ఈ సభకు సంఘం జిల్లా కార్యదర్శి కా॥ టి. అరుణ అధ్యక్షత వహించారు. రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ సింహాద్రి ఝాన్సీ ఈ సభలో మాట్లాడుతూ ఒకే సమయంలో జరిగిన నక్సల్బరీ, శ్రీకాకుళ రైతాంగ ఉద్యమాలు భూమి, భుక్తి, విముక్తి కోసం జరిగిన పోరాటాలని, దోపిడి, పీడన లేని నూతన సమాజాన్ని ఆవిష్కరించడానికి ఎందరో నేలకొరిగారని గుర్తుచేశారు. శ్రీకాకుళ పోరాటంలో సుమారు 360 మంది ప్రజా ఉద్యమ కార్యకర్తలు, ప్రజాతంత్ర ఉపాధ్యాయులు, డాక్టర్లు, మేధావులు, గిరిజనులు అమరు లయ్యారన్నారు. అడవి నుండి ఆదివాసీలను ఖాళీ చేయించడానికి ఈనాటికీ రకరకాల కుట్రలు, కుతంత్రాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఉద్యమాన్ని అణచిపెట్టి సంస్కరణల భ్రమలతో ప్రజలను మభ్యపెడుతున్న పాలకుల తీరును ఎండగట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామ్రాజ్యవాదులకు, విదేశీ బహుళజాతి సంస్థలకు అనుకూలంగా ప్రజా వ్యతిరేకమైన చట్టాలను తీసుకువస్తున్నారని తీవ్రంగా విమర్శించారు.

ఇంకా ఈ సభలో ఏపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కొప్పల భానుమూర్తి, రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర సహాయకార్యదర్శి కా॥ దంతులూరి వర్మ తదితరులు మాట్లాడుతూ అమరుల స్ఫూర్తితో ప్రజల హక్కులకై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ముందుగా స్థూపం వద్ద అమరులకు నివాళులు అర్పిస్తూ మౌనం పాటించారు. ఎర్రజెండాను ఆవిష్కరించారు. సభా ప్రాంగణం వద్ద ఎర్ర తోరణాలతో అలంకరించారు. ప్రజా కళాకారుల సమాఖ్య కళాకారులు అమరులను స్మరిస్తూ పాడిన పాటలు, నృత్యాలు సభకు ఉత్తేజాన్ని అందించాయి.

**పార్వతీపురం, 31-10-2020 :**

కా॥ కోరన్న, మంగన్నల 53వ వర్ధంతిసభ పార్వతీపురం బైపాస్ రోడ్డులోనున్న రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) జిల్లా కార్యాలయంలో జరిగింది. రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర సహాయకార్యదర్శి కా॥ దంతులూరి వర్మ మాట్లాడుతూ 1967లో సాగిన శ్రీకాకుళ గిరిజన పోరాటం గిరిజన ప్రాంతంలో వున్న భూమి సమస్యను ఎజెండా మీదకు తీసుకువచ్చిన పోరాటమని వివరించారు. ఉద్యమాన్ని అణచిపెట్టడానికి ఒకవైపున తీవ్రమైన నిర్బంధం ప్రయోగిస్తూనే, మరొక ప్రక్క 1/70 చట్టం, ఐటిడిఏలు, జిసిసిలు లాంటి సంస్థలను తీసుకు వచ్చారన్నారు. అయినా నేటికీ గిరిజన ప్రాంతాల్లో భూమి సమస్య, అటవీ సమస్య పూర్తిగా పరిష్కారం కాకపోగా కనీస సౌకర్యాలైన విద్య, వైద్యం, మంచినీరు, రహదారులు ఇంకా ఆమడ దూరంలోనే వున్నాయని విమర్శించారు. శ్రీకాకుళ గిరిజనోద్యమ అమరుల స్ఫూర్తితో ఆదివాసులు, రైతు, కూలీలు పోరాటం చెయ్యాలని పిలుపునిచ్చారు.

సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కా॥ కద్రక వెంకటస్వామి అధ్యక్షతన జరిగిన ఈ సభలో సంఘం జిల్లా అధ్యక్షులు కా॥ ఊయక ముత్యాలు, ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు కా॥ ఎం. గోపాలం, సంఘం జిల్లా నాయకులు కామ్రేడ్స్ బొత్స నర్సింగరావు, పి. శ్రీను నాయుడు, ఎం. భాస్కరరావు తదితరులు ఉపన్యసించారు. పార్వతీపురం, కొమరాడ, కురుపాం, సీతానగరం, మక్కువ తదితర మండలాల నుండి రైతుకూలీలు, గిరిజనులు హాజరైనారు.

★ ★ ★